

# రేపటి వెలుగు

"గుడ్‌మార్నింగ్!" వేకువలో జారిన తొలి కిరణంలా లోపలికి వచ్చింది మిస్ రోజీ. "గుడ్ మార్నింగ్" చిరునవ్వుతో ఆహ్వానించింది శ్రుతి. విద్యాసంస్థలు వ్యాపార సంఘాలుగా మారి హాస్టలు జీవితం తమ జీవితంలో ఒక పీడకలగా పిల్లలు భావించే స్థాయిలో వున్న

బోర్డింగ్ స్కూల్స్ వర్ధిల్లుతున్న తరుణంలో పదిమంది పిల్లల్ని తన యింట్లో వుంచుకుని వాళ్ళకు సమగ్రమైన ఆహారంతోబాటు కాస్తంత ప్రేమనూ, ఆప్యాయతనూ పంచే మిస్ రోజీ అంటే గౌరవం శ్రుతికి. పిల్లలకు కావలసింది కేవలం చదువు, విజ్ఞానం, సంపాదనకు కావలసిన సమర్థతను అలవరచుకోవడమే కాదు. వారి శారీరక, మానసిక వికాసానికి దోహదపరచే వాతావరణం, పరిస్థితులు కూడానని నమ్మి, అందుకు శక్తివంచన లేకుండాకృషి చేస్తున్న మిస్ రోజీకి తన వంతు సహాయాన్నందిస్తూ పిల్లలకు ఏ జబ్బు చేసినా శ్రద్ధగా చూస్తుంది శ్రుతి.

"పిల్లలంతా బావున్నారా!" శ్రుతి అడిగింది.

"ఒక కుర్రాడి విషయంలో మీ సలహా కోసం వచ్చాను"

"చెప్పండి."

"రవి తెలుసుగా మీకు?" రోజీ ప్రశ్నవిని ఒక క్షణం ఆలోచిస్తూ వుండిపోయిన శ్రుతి కళ్ళు అకస్మాత్తుగా తళుక్కుమన్నాయి.

"ఓ! గుర్తొచ్చాడు. గిరజాల జుట్టు, తెల్లటి బూరి బుగ్గలు, చక్రాల్లాంటి కళ్ళను తిప్పుతూ ముద్దుముద్దుగా కబుర్లు చెప్తాడు - వాడే కదూ?" ఉత్సుకంగా చూసింది శ్రుతి.

"ఎస్... వన్ మినిట్. రవీ!" రోజీ పిలుపు విని రవి లోపలికి వచ్చాడు.

"వీడా రవి?" నమ్మలేనట్లు చూస్తుంది శ్రుతి. పలచబడిన జుట్టు, పాలిపోయిన చెక్కిళ్ళు, ఎండిపోయిన శరీరం, కాంతిలేని కళ్ళు. దీర్ఘకాలిక జబ్బుతో బాధపడుతున్న వాడిలా వున్నాడు.

"ఏమయింది? ఎందుకిలా అయ్యాడు? సెలవుల్లో జబ్బేమైనా చేసిందా?" రవిని పరీక్షచేసి బయటకు పంపి అడిగింది శ్రుతి.

"పెద్ద జబ్బేమీ చెయ్యలేదట. కాని... ఇతన్ని చూస్తుంటే ఇంట్లో వుంచుకోవడానికి జంకుగా వుంది. ఏదైనా జబ్బువల్ల యిలా అయిపోయాడేమో. అది మిగతా పిల్లలకు అంటుకుంటుందేమోనన్న అనుమానం. కొంచెం కోలుకునే దాకా స్కూలు పోయినా వాళ్లింట్లోనే వుంచుకోమందామంటే - ఇంటి మాటెత్తితే చాలు హడిలి పోతున్నాడు. బలవంతాన వాళ్ళింటికి పంపడానికి బాధగా ఉంది. ఇక్కడే వుంచుకోవడానికి మిగతా పిల్లల క్షేమం దృష్ట్యా భయంగా ఉంది" విచారంగా చెప్పింది రోజీ.

"క్లినికల్‌గా పెద్ద జబ్బేం కనబడడంలేదు. కాని ఇంత మార్పుకు కారణమేమిటో? ఇంటి మాటెత్తితే ఎందుకు హడిలిపోతున్నాడు? అసలు కారణమేమిటో తెలుసుకుని కరెక్ట్ చెయ్యకపోతే

ఇతను మానసికంగా యింకా దెబ్బతినే అవకాశం వుంది" దీర్ఘంగా ఆలోచిస్తూ అంది శ్రుతి.

"అతని తల్లిదండ్రుల్ని గురించి, కుటుంబం గురించి ఏమీ తెలియదా మీకు" శ్రుతి ప్రశ్నవిని ఓ క్షణం ఆలోచిస్తూ వుండిపోయింది రోజీ.

"పిల్లల తల్లిదండ్రుల వ్యక్తిగత విషయాల గురించి తరచి అడిగే అలవాటు లేదు నాకు. రవిని వాళ్ళమ్మ తీసుకొచ్చి చేర్పించింది. వాళ్ళ నాన్నెప్పుడూ రాలేదు. ఎప్పుడొచ్చినా ఆవిడ ఒక్కతే వచ్చి రవికి కావలసినవి కొనిచ్చి వెళ్తూ వుంటుంది."

"మళ్ళీ యెప్పుడొస్తుందామె? ఆవిడతో మాట్లాడి రవిని గురించి అసలు విషయం తెలుసుకోవాలి."

"మీతో మాట్లాడి మీ సలహా తీసుకుని రవిని ఉంచుకునేదీ లేనిదీ చెప్తానని రేపోసారి రమ్మన్నానామెను. రేపు మీ దగ్గరకు తీసుకొస్తాను."

మరునాడు రవి తల్లి సుభద్రను శ్రుతి దగ్గరకు తీసుకొచ్చింది రోజీ. శ్రుతి రవి గురించి, ఆమె కుటుంబం గురించి ఆమె నొచ్చుకోకుండా జాగ్రత్తపడుతూ అడిగింది. శోకదేవతలా కూర్చున్న సుభద్ర పెదవి విప్పి ఒక ప్రశ్నకూ జవాబివ్వలేదు. చివరికి మౌనంగానే చేతులు జోడించి సెలవు తీసుకుని వెళ్ళిపోయింది.

చిక్కుముడిలా ఉన్న సుభద్రను మరిచిపోవడానికి శ్రుతి ప్రయత్నిస్తూ వుండగా సుభద్ర దగ్గర్నుంచి జాబు వచ్చింది.

డాక్టర్ గారూ!

నేను రవి తల్లిని. అంతగా సభ్యతని పాటించకుండా మీ ప్రశ్నలకు జవాబివ్వని నన్ను మీరు మరచి వుండరనే అనుకుంటున్నాను. నేనసహ్యించుకుంటున్న నా కుటుంబ జీవితం గురించి, నన్ను రంపపుకోత పెడుతున్న నా మానసిక పరిస్థితి గురించి నా అంతట నేను నోరువిప్పి చెప్పుకోలేక మీ ఎదుట మూగనోము పట్టాను.

నా చిన్నారి తండ్రి రవి అలా అయిపోవడానికి కారణం నేనే... ఒక దాని వెంట ఒకటి ఎన్నో తప్పటడుగులు వేస్తూ సమస్యల సుడిగుండంలోకి చేరుకున్నానిప్పుడు. ప్రేమించానని భ్రమించి కన్నవారిని ఎదిరించి బయటికొచ్చి రవి తండ్రిని వివాహం చేసుకున్నాను. కొన్ని నెలలు కూడా గడవకుండానే నేను పెంచుకున్న కోరికలు, నేను కన్న సుందర స్వప్నాలు ఆధారం లేనివని తెలిసొచ్చింది. మమ్మల్ని సన్నిహితం చేసిన ఆకర్షణ పొరలు విడిపోగానే



కథా నిలయం
5487
శ్రీకాకుళం

నాభర్త, నేను భిన్న ధృవాలమని తేలిపోయింది. నా భర్తకు నేను సంపాదించే డబ్బూ కావాలి, తన పరిధిలో నుంచి బయటికి తొంగి చూడకుండా, పెదవి విప్పకుండా అతని అడుగులకు మడుగులొత్తుతూ బానిసలానూ పడుండాలి. స్వేచ్ఛకు, బానిసత్వానికి తేడా తెలిసిన నేను బానిసలా పడివుండలేకపోయాను. అతన్ని నేను కోరుకున్నట్లుగా మార్చుకునే ప్రయత్నంలో విఫలురాల్ని అయ్యాను. ఫలితంగా నా భర్తనుంచి విడిపోయి రవితో బయటికొచ్చేశాను.

భర్త నుంచి ధైర్యంగా విడిపోయి బయటికొచ్చిన నేను అంతే ధైర్యంగా బ్రతకలేక పోతున్నాను. ఈ క్రొత్త జీవితాన్ని, క్రొత్త పరిస్థితుల్ని చూసి నేను బెదిరిపోతున్నాను. అనుక్షణం భయంతో ఒణికిపోతున్నాను. నేను కోరుకున్న జీవితం నాకు లభించలేదన్న దుగ్ధ, ప్రస్తుతం నేననుభవిస్తున్న జీవితంపట్ల నాకున్న అసంతృప్తి కలిసి నిర్దయగా నా మనసుని నలిపేస్తున్నాయి. నేనేం చేస్తున్నానో, ఎలా ప్రవర్తిస్తున్నానో తెలియనంతటి ఉన్మాద స్థితిలోకి పోతున్నాను. పువ్వులా సుకుమారంగా చూసుకోవలసిన పసివాణ్ణి క్రూరంగా హింసించాను. నా రెక్కలకింద దాచుకుని రక్షించవలసిన వాణ్ణి అతి దారుణంగా బాధించాను. నాలోని మాతృత్వం, మానవత్వం మంటగలిసిపోయి పిశాచినిలా ప్రవర్తించాను.

నా బాబు గురించి మీరు, మిస్ రోజీ పడుతున్న ఆరాటం చూశాక నా తప్పు తెలిస్తోంది. నిష్ఫలంగా గడిచిపోతున్న నా ఈ జీవితమెలా తిరగిరాదో కమ్మని కలలా గడిచిపోవలసిన నా బాబుబాల్యమూ తిరిగిరాదు. వ్యక్తిగా నా సుఖసంతోషాల గురించి తాపత్రయ పడడమేగాక తల్లిగా ప్రేమతో నా బాబు భావికి సోపానాలు వెయ్యవలసిన బాధ్యత కూడా నా మీదుందనే నిజాన్ని గుర్తుచేశారు మీరు. రవి నన్ను ప్రేమతో పెనవేసుకోని రోజున నేను వ్యక్తిగానేగాక తల్లిగా కూడా ఓడిపోయినట్లే లెక్క అన్న వాస్తవాన్ని గుర్తించేలాచేశారు. అందుకు మీకెంతో కృతజ్ఞురాలిని.

నా మనసును నలిబిలి చేస్తున్న సంఘర్షణ నుంచి తప్పుకుని రవి కోసం స్థిరచిత్తంతో పరిస్థితులలో పోరాడతాను. ఇంక నా ప్రాణం, జీవితం లక్ష్యం అన్నీ రవే.

నమస్సులతో
సుభద్ర